నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, మంగళవారం 30 జూలై 2024 | MEDAK

సిద్దిపేట జిల్లాలోని బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయం

ఆలయ భూమికి ఎసరు

బెక్కల్ రామలింగేశ్వరస్వామి భూములు అన్యాక్రాంతం

- ఆలయానికి 24.10 ఎకరాల భూమి
- ఇందులో దాతలు ఇచ్చిన 3 ఎకరాల భూమి మాయం
- మిగతా భూముల హద్దులు చెరిపేస్తున్న సమీప రైతులు
- రెవెన్యూ అధికారుల తీరుతో ఆలయానికి నష్టం
- కాపాడాలంటున్న గ్రామస్తులు, భక్తులు

సిద్దిపేట, జూలై 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట జిల్లాలోని రామలింగేశ్వర స్వామి ఆలయ భూములకు రక్షణ కరువైంది. కొందరు ఆలయ భూములకు ఎసరు పెట్టారు. ఏకంగా రికార్డులు మార్చేసి పట్టాలు చేయించుకుని దర్జాగా అనుభవిస్తున్నారు. రెవెన్యూ శాఖలోని అవినీతి అధికారుల అండదండలతో భూకబ్జాదారులు ఆడింది ఆట పాడింది పాటగా మారింది. ఆలయానికి దాతలు ఇచ్చిన మూడెకరాల భూమి మాయమైపోయింది. అంతేకాకుండా ఆలయ భూముల హద్దులు చెరిపేస్తూ ఆక్రమణకు యత్నిస్తున్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి ఆలయ భూములను కాపాడాలని గ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు.

ఏకంగా రికార్డులు మార్చి పట్టాలు...

ఆలయ భూములను రక్షించాల్సిన అధికారులు లంచాలకు అలవాటు పడి ఏకంగా పట్టాలే మార్చేశారు. దానం చేసిన భూమి కొన్నేండ్ల వరకు ఆలయం పరిధిలో ఉంది. రాను రాను ఆ భూమిపై నేతల కన్ను పడింది. దాతల నుంచి విరాళంగా వచ్చిన మూడెకరాల భూమి రెవెన్యూ రికార్డుల్లో నమోదు కాలేదు. ఇదే అదునుగా భావించి, ఆ భూమిని కొంతమంది వ్యక్తులు ఏకంగా తమ పేరిట పట్టాలు చేసుకొని రికార్డులు మార్చుకున్నారు. ఈ విషయం రికార్డులను పరిశీలిస్తే స్పష్టంగా తెలుస్తుంది. గుట్టకు ఆనుకుని ఉన్న మూడెకరాల స్థలం ప్రస్తుతం ఉన్న 289ఇ ఖాతా నంబర్ 0.18 గుంటలు, 289ఎఫ్ ఖాతా నంబర్ 2.24 గుంటలు మొత్తం కలిసి 3.02 గుంటలు స్థలం రికార్డులను పరిశీలించి ఆ పట్టాలు రద్దుచేయాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. దాతలు కోరిన ప్రకారంగా రామలింగేశ్వరస్వామి పేరుమీద పట్టామార్పిడి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఆలయ భూమిని అమ్మినా, కొన్నా చట్టప్రకారం చెల్లదని దేవాదాయ శాఖ చట్టం చెబుతోంది.ఆలయ అభివృద్ధికి పాటుపడాల్సిన వారు ఆలయ భూములను కబ్జా చేయడం ఏమిటి అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రామలింగేశ్వర స్వామి దేవస్థానం బెక్కల్ పేరు మీద ఆ భూమిని పట్టాచేసి హక్కులు పూర్తిగా ఆలయానికి చెందేలా పట్టా పాస్ పుస్తకాలతో పాటు ధరణిలో చేర్చాలని ప్రభుత్వం, దేవాదాయ శాఖ సంచాలకులు, కలెక్టర్‌ను భక్తులు, గ్రామస్తులు కోరుతున్నారు.

రామలింగేశ్వరస్వామి మూలవిరాట్

చేయి తడిపితే చాలు...

బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయ భూములు కబ్జాకు గురైతే రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నట్లు..? ఆలయ భూములకు పరిరక్షణ వారికి పట్టదా అని ప్రజలు, భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఆలయ ఆధీనంలో ఉన్న భూములు హద్దులు చెదిరిపోతున్నాయి. నలుదిక్కులా హద్దులు జరుగుతున్నాయి. ఇటీవల అధికారులు చేసిన సర్వేలో సైతం ఈ విషయం తేటతెల్లమైంది. ఆలయ భూమికి సంబంధించిన రికార్డుల్లో ఉన్న 21 ఎకరాల 8గంటల భూమి వాస్తవంగా మోకాపై లేదు, సమీప రైతులు ఆలయ భూముల్లోకి అక్రమంగా ప్రవేశిస్తున్నారు. పక్కనే ఉన్న వ్యక్తి ఎకరం భూమి హద్దులు దాటి ఆలయ భూమిలోకి వచ్చాడు. రాను రాను ఈ ఎకరం కూడా ఇతరుల వశం అయ్యే అవకాశం ఉంది. ఇంకోవైపు అర ఎకరం వరకు ఇదే పరిస్థితి ఉంది. గతంలో సర్వేయర్లు ఏర్పాటు చేసిన హద్దులను సమీప రైతులు చెరిపివేస్తున్నారు. దాతల నుంచి విరాళంగా వచ్చిన మూడెకరాల భూమి ఇప్పటి వరకు రెవెన్యూ రికార్డుల్లో నమోదు కాలేదు. ఇదే అదునుగా భావించిన కొంత మంది అక్రమంగా రికార్డుల్లోకి మార్చుకొని, అనంతరం దానిని అమ్ముకున్నారు. ఈ తతంగంలో స్థానిక రెవెన్యూ అధికారులు, కొంతమంది బడానేతల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అన్యాక్రాంతమైన దాతలు ఇచ్చిన భూమి

పోచమ్మ ఆలయం ఎదుట దేవాలయ భూమి

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం..

బెక్కల్ రామలింగేశ్వరస్వామి ఆలయ భూములు అన్యాక్రాంతమైనట్లు మాకు లిఖిత పూర్వకంగా ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. ఒకవేళ భూములు అన్యాక్రాంతమైతే చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదు వస్తే ఆర్ఐని ఫీల్డ్‌కు పంపించి విచారణ చేపట్టాలని ఆదేశిస్తా. ఆలయ భూముల పరిరక్షణకు ఫెన్సింగ్ వేయించేలా ఆలయ కమిటీ చొరవ చూపాలి. దాతలు ఇచ్చిన మూడెకరాల భూమికి సంబంధించి ఆలయ కమిటీ తగిన ఆధారాలతో వస్తే ఆ భూమిని పట్టా చేసుకున్న వ్యక్తుల పేర్లు తొలిగించి, ఆలయం పేరు మీద రికార్డు మార్చాలని కలెక్టర్‌కు నివేదిస్తా.

–ఎర్రోళ్ల శ్యాం, తహసీల్దార్, ధూళిమిట్ట మండలం(సిద్దిపేట జిల్లా)

దాతలు ఇచ్చిన భూమి రికార్డులు మార్పు

మహిమాన్విత బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయానికి దాతలు ఇచ్చిన మూడెకరాల భూమికి సంబంధించి ఇప్పటికే రికార్డులు మారిపోయాయి. ఆలయానికి ఉన్న మరో 21 ఎకరాల 8గుంటల భూమిని సైతం వదిలిపెట్టకుండా సమీప వ్యక్తులు హద్దుల్లోకి చొచ్చుకు వస్తుండడంతో అన్యాక్రాంతం అవుతున్నాయి. రామలింగేశ్వర స్వామి ఆలయ గుట్టకు ఆనుకుని ఉన్న మూడెకరాల 2 గుంటల భూమిని 1982లో బైరాన్‌పల్లికి చెందిన రాముని చంద్రయ్య తండ్రి వీరయ్య, రాముని రామయ్య తండ్రి చిన్నలింగయ్య విరాళంగా ఇచ్చారు. వారి సొంత పట్టా కలిగిన సర్వేనెంబర్ 289లో ఉన్న సుమారు 3 ఎకరాల 2 గుంటల భూమిని ఈ ప్రాంత భక్తుల సౌకర్యార్థం ధర్మశాల నిర్మాణానికి వారి ఇలవేల్పు రామలింగేశ్వర స్వామి ఆలయానికి దాన పూర్వకంగా రాసి ఇచ్చారు. అప్పటి నుంచి ఆలయానికి వచ్చే భక్తులు ఆ భూమిలో వంటలు చేసుకోవడానికి వాడుకుంటున్నారు. ఆలయానికి రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం పోచమ్మకు మొక్కులు చెల్లించిన తర్వాత ఇక్కడే వంటలు చేసుకొని భోజనాలు చేసి వెళ్తుంటారు. దాతలు ఇచ్చిన భూమిలో వసతి గృహం కూడా ఉండేది. 25 ఏండ్ల కిందట ఆలయానికి, గ్రామానికి తాగునీటి సౌకర్యార్థం అందులో బావిని తవ్వించారు. వీటితోపాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, భక్తుల సౌకర్యార్థం హ్యాండ్ బోర్ పంపు ఉంది.

అన్నదాతకు మళ్లీ నిరాశే !

రెండో విడతలో తక్కువ మందికే రుణమాఫీ

- సంగారెడ్డి జిల్లాలో 25191 రైతులకు రూ.268 కోట్లు మాఫీ
- రుణమాఫీపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి

సంగారెడ్డి, జూలై 29(నమస్తే తెలంగాణ): రెండో విడత పంట రుణమాఫీపై సంగారెడ్డి జిల్లా రైతుల్లో నిరాశను నింపింది. ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి మాటతప్పి విడతల వారీగా రుణమాఫీ చేస్తుండడంపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. మొదటి విడత రుణమాఫీపై ఆయోమయం నెలకొనగా, తాజాగా ప్రభుత్వం రెండో విడత రుణమాఫీ ప్రకటించింది. మంగళవారం సంగారెడ్డి జిల్లాలో రెండో విడత రుణమాఫీ అమలు చేయనున్నారు. రెండోవిడతలోనూ చాలా తక్కువ మంది రైతులకు రుణమాఫీ అవుతున్నట్లు తెలుస్తున్నది. దీంతో పంటరుణమాఫీ అమలుపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది. రేవంత్‌రెడ్డి తాము అధికారంలోకి రాగానే రూ.2 లక్షల వరకు పంటరుణం ఏకకాలంలో చేస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి విడతల వారీగా పంట రుణమాఫీ అమలు చేస్తున్నారు. ఈనెల 18న మొదటి విడత రుణమాఫీ అమలు చేశారు. లక్ష రూపాయల్లోపు తీసుకున్న పంటరుణాలు మాఫీ చేస్తున్నామని ప్రకటించిన ప్రభుత్వం జిల్లాలో ఎంత మంది రైతులు అర్హులు అనే వివరాలను ప్రకటించకుండా నేరుగా లబ్ధిదారుల జాబితా ప్రకటించింది. రుణమాఫీకి పీఎం కిసాన్ సమ్మాన్ నిబంధనలు, రేషన్ కార్డు ముడిపెట్టడంతో సంగారెడ్డి జిల్లాలో తక్కువ మంది రైతులకు లక్ష రూపాయల్లోపు రుణమాఫీ అయ్యింది. జిల్లాలో లక్ష రూపాయల్లోపు రుణం తీసుకున్న వారి రైతుల సంఖ్య సుమారు 1.50 లక్షల మందికిపైగానే ఉంటారని అంచనా. అయితే ప్రభుత్వం మొదటి విడతలో లక్ష రూపాయల రుణం తీసుకున్న 48,970 మంది రైతులకు రూ.279.62 కోట్ల రుణమాఫీ చేసింది. చాలా మంది రైతులు లక్షరూపాయల్లోపు పంట రుణం తీసుకున్నా మాఫీ కాలేదని నిత్యం వ్యవసాయశాఖ, బ్యాంకు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం మంగళవారం రెండో విడత రుణమాఫీ చేయనున్నది. రూ.1.50 లక్షల రుణం తీసుకున్న రైతులకు రెండో విడతలో పంటరుణం మాఫీ చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో రెండో విడతలో 25,191 మంది రైతులకు రూ.268.35 కోట్ల రుణమాఫీ అవుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. 1.50 లక్షల రూపాయల రుణం తీసుకున్న రైతుల సుమారు 50వేల మందికిపైగానే ఉంటారు. ప్రభుత్వం 25,191 మందికి మాత్రమే రెండో విడత రుణమాఫీ ప్రకటించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వంతీరుపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో రెండో విడత రుణమాఫీ కార్యక్రమాన్ని సీఎం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నారు. ముగ్గురు రైతులకు నమూనా చెక్కులను అందజేయనున్నారు.

గోమారంలో ఫలహార రథం ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి

ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు

గోమారంలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి

శివ్వంపేట, జులై 29 : మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గోమారంలో నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి స్వగృహం నుంచి ఆమె కుమారులు వాకిటి శ్రీనివాస్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి ఏర్పాటు చేసిన అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ యాదవరెడ్డితో కలసి ఎమ్మెల్యే సునీతారెడ్డితో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా యాదవరెడ్డి మాట్లాడుతూ..ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత కలిగి ఉండాలన్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ..అమ్మవారి చల్లని చూపుతో ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు, కుంటలు నిండి పంటలు బాగా పండి జిల్లా ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, ఎంపీపీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ కో ఆప్షన్ మాజీ సభ్యుడు మన్సూర్, మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణా గౌడ్, బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరి వీరేశం, సంతోష్‌రెడ్డి, వాకిటి హనుమంతరెడ్డి, మహిపాల్ రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు మొలుగు నాగేశ్వరరావు, మర్రి మహేందర్ రెడ్డి, గూడూరు యాదగౌడ్, రాంచంద్రం గౌడ్, ఉప సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు పంచమి రేణుకుమార్, పవన్ గుప్తా పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

- సిద్దిపేట శిల్పారామం పనులు ప్రారంభించండి
- వెయ్యి పడకల దవాఖాన పనులు వెంటనే ప్రారంభించాలి
- సిద్దిపేట నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వ దృష్టికి తెచ్చిన ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, జూలై 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి):శాసనసభ సమావేశాల్లో సిద్దిపేట నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, ఆగిన అభివృద్ధి పనుల గురించి స్థానిక ఎమ్మెల్యే హరీశ్‌రావు లేవనెత్తారు. వీటిని సోమవారం స్పీకర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సిద్దిపేట నియోజకవర్గ సమస్యలపై కట్ మోషన్ సమయంలో అసెంబ్లీలో ప్రస్తావించారు. గత ప్రభుత్వం పలు అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేసిందన్నారు. ఆ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కోమటి చెరువుకు మరింత పర్యాటక శోభ తెచ్చేలా రూ.15 కోట్లతో నిర్మిస్తున్న శిల్పారామం పనులు నిలిపి వేశారని, వెంటనే పనులు ప్రారంభించి పూర్తిచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లాకేంద్రంలో మెడికల్ కాలేజ్ అనుబంధంగా నిర్మించిన 1000 పడకల దవాఖాన పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయని, పూర్తిచేసి ప్రజలకు వైద్యసేవలు అందించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో దవాఖాన ప్రారంభించుకున్నామని, మిగిలిన పనులు నేపథ్యంలో ప్రస్తుతం నడుస్తున్న దవాఖానను వెయ్యి పడకలకు అప్‌గ్రేడ్ చేయలేకపోయామని, ఈ పనులు పూర్తయితే పూర్తిస్థాయి దవాఖాన అందుబాటులోకి వచ్చి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు.

కారును ఢీకొట్టిన ట్రక్కు..ఇద్దరు మృతి

సంగారెడ్డి జిల్లా హుస్సేల్లి శివారులో ప్రమాదం

ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

న్యాల్‌కల్, జూలై 29: మండలంలోని హుస్సేలి గ్రామ శివారులోని బీదర్–జహీరాబాద్ రోడ్డుపై కారును ట్రక్కు ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. ఆరుగురు గాయపడ్డారు. జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు వివరాల ప్రకారం..బీదర్ పట్టణ సమీపంలో ముల్తానీ బాద్‌షా దర్గా ప్రాంతానికి చెందిన వారు ఆదివారం హైదరాబాద్‌లోని తమ బంధువుల వద్ద దావత్‌కు (కేఏ37ఎం 5096) టవేరా కారులో వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున వారు కారులో తిరిగి బీదర్‌కు బయలుదేరారు. మండలంలోని హుస్సేల్లి గ్రామ శివారులో బీదర్ వైపు నుంచి జహీరాబాద్‌కు వస్తున్న(టీఎస్08టీ 3198) ట్రక్కు డ్రైవర్ వేగంగా కారును ఢీకొట్టాడు. దీంతో కారు పల్టీలు కొట్టి బోల్తాపడి నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ఘటనలో కారు డ్రైవర్ సిరాజుద్దీన్, కారులో ప్రయాణిస్తున్న షాహీదాబేగం అక్కడికక్కడే మృతి చెందారు. షేక్ అయాన్ తీవ్రంగా గాయపడగా, మరో ఐదుగురు గాయపడ్డారు. జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు, హద్నూర్ పోలీసులతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే చికిత్స నిమిత్తం క్షతగాత్రులను బీదర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హద్నూర్ పోలీసులు తెలిపారు.

ఈరోజు టోకెన్...రేపు అమౌంట్

మెదక్, జూలై 29 (నమస్తే తెలంగాణ): పంట రుణమాఫీ డబ్బులు తీసుకోవడానికి రైతులు బ్యాంకుల చుట్టూ చక్కర్లు కొట్టాల్సి వస్తున్నది. కాంగ్రెస్ సర్కారు ఈనెల 18న రూ. లక్షలోపు మొదటి విడత రుణమాఫీ చేసినట్లు ప్రకటించగా, 19న రైతులు బ్యాంకుల వద్ద రుణమాఫీ డబ్బుల కోసం బారులుతీరారు. కానీ, బ్యాంకు అధికారులు మాత్రం ఇంకా బ్యాంకుకు డబ్బులు రాలేదని, వచ్చిన తర్వాత ఇస్తామని చెప్పడంతో వెనుదిరిగారు. మెదక్ పట్టణంలోని ఏపీజీవీబీ బ్రాంచ్‌లో రూ.లక్షలోపు 1800 మందికి రుణమాఫీ అయ్యింది. ఇందులో ఇప్పటివరకు 600 మంది రైతులకు మాఫీ డబ్బులు చెల్లించారు. మిగతా రైతులు రోజూ బ్యాంక్‌కొచ్చి వెళ్తున్నారు. దీంతో బ్యాంకు అధికారులు రోజూ 50 మందికి టోకెన్లు ఇచ్చి, మరుసటి రోజు రుణమాఫీ డబ్బులు చెల్లిస్తున్నారు. చేసేదిలేక రైతులు ఉదయమే బ్యాంకు వద్దకొచ్చి క్యూకడుతున్నారు. తాము శుక్రవారం టోకెన్ తీసుకున్నామని, సోమవారం డబ్బులు ఇస్తామని చెబితే వచ్చామని, రోజంతా పడిగాపులు పడుతున్నామని పలువురు రైతులు తెలిపారు.

నాలుగంట్ల రాత్రి వచ్చినా...

నాలుగొట్టె రాత్రి వచ్చినా క్రాప్ లోన్ గురించి. మొన్న శుక్రవారం వస్తే ఇయ్యల్లా రమ్మన్నారు. టోకెన్ ఇస్తరంట. పిచ్చి దానిలాగ కూసున్నా. క్రాప్‌లోన్ కోసం తిరుగుతున్న. టోకెన్ ఇచ్చిండ్రు.. ఈడ కుసోమంటే కుసున్నా.

– రాజమ్మ, రైతు, మగ్ధుంపూర్



మెదక్ ఏపీజీవీబీ ఎదుట బారులుతీరిన రైతులు

డెంగీతో ఇంటర్ విద్యార్థి మృతి

నిఖిల్(ఫైల్)

చిన్నశంకరంపేట, జూలై 29: మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల సూరారంలో సోమవారం డెంగీతో ఇంటర్ విద్యార్థి మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన సరస్వతి, వెంకటేశం దంపతుల పెద్ద కుమారుడు కుమ్మరి నిఖిల్ (17) హైదరాబాద్ బోరంపేటలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 19న కళాశాల యాజమాన్యం విద్యార్థులకు హోమ్ సిక్ సెలవులు ఇవ్వడంతో నిఖిల్ ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం ఆయన ఒక్కసారిగా అస్వస్థతకు గురికాగా, చేగుంటలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. అక్కడ రక్త పరీక్షలు చేయించగా డెంగీగా తేలింది. తెల్ల రక్తకణాలు పూర్తిగా పడిపోయాయని వైద్యులు హైదరాబాద్‌కు సిఫార్సు చేశారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి ఆదివారం అర్ధరాత్రి నిఖిల్ మృతి చెందాడు.



నర్సాపూర్‌లో రైతు రిలే నిరాహార దీక్షలో లోక్‌సత్తా, సీపీఎం నాయకులు

రైతులకు న్యాయం చేయాలి

నర్సాపూర్, జూలై 29: కొండపోచమ్మ సాగర్ కాలువ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం సరైన ధర నిర్ణయించి పరిహారం అందించి న్యాయం చేయాలని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రశేఖర్, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. నర్సాపూర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో భూనిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు సోమవారం వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఆర్డీవో రైతువేదికలో రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి అవార్డు పథకం కింద రైతుల కోరికలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తానని చెప్పాడని,కానీ ప్రభుత్వాల నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. రాజకీయ నాయకులు రైతుల దీక్ష గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలన్నారు. రైతులకు సరైన ధర ఇవ్వాలి లేదా కాలువను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో సీపీఎం నాయకుడు నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

సిద్దిపేట రైతుబజార్ వద్ద వీధి కుక్కల గుంపు

బెంబేలెత్తిస్తున్న

వీధికుక్కలు

సిద్దిపేట పట్టణంలో వీధికుక్కలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. రోడ్ల వెంట గుంపులుగా తిరుగుతూ జనాన్ని భయాందోళనకు గురిచేస్తున్నాయి. వాహనదారుల మీదికి కుక్కలు దూసుకువచ్చి గాయపరుస్తున్నాయి. చిన్నలు, వృద్ధులు కుక్కల దాడిలో ఎక్కువగా గాయపడుతున్నారు. పట్టణంలో వీధికుక్కలకు కు.ని.ఆపరేషన్లు చేసే కార్యాలయం మూతపడింది. దీంతో వీధికుక్కల సంఖ్య పెరిగి పట్టణంలో ఎక్కడపడితే అక్కడ గుంపులుగా తిరుగుతూ హడలెత్తిస్తున్నాయి. కొత్తవారు కనిపిస్తే దాడులకు పాల్పడుతున్నాయి. పిల్లలు పాఠశాలలకు వెళ్లి వచ్చేటప్పుడు ఎక్కువగా కుక్కల బారిన పడుతున్నారు.

– సిద్దిపేట స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జూలై 29

సిద్దిపేటలో మూసిఉన్న వీధికుక్కల జనన నియంత్రణ కార్యాలయం